ప్రజాశక్తి
ఆదివారం 6 ఏప్రిల్ 2025
5
అల్లూరి సీతారామరాజు

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా సభ ప్రాంగణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7న సోమవారం అరకు లోయలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఉందన్నారు. అనంతరం డుంబ్రిగుడ మండలంలో ఉప ముఖ్యమంత్రి పర్యటిస్తారన్నారు. మండల వ్యాప్తంగా 120 బీటి రోడ్లు మంజూరయ్యాయని, ప్రధానంగా చాపరాయి నుంచి పెదపాడు గ్రామానికి బీటీ రోడ్డు మంజూరయ్యిందని తెలిపారు. బీటి రోడ్డు శంకుస్థాపన ఉప ముఖ్యమంత్రి చేస్తారని చెప్పారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సభ ఉంటుందని చెప్పారు.

ఏర్పాట్లపై ఆరా తీస్తున్న పిఒ

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ - ఘనంగా జయంతి వేడుకలు

పాడేరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి పాడేరు : బాబూ జగ్జీవన్ రామ్ జీవితం సమాజానికి, దళితుల సంక్షేమానికి అంకితం చేసారని అటువంటి మహనీయుని ఆదర్శంగా తీసుకుని అందరం సమాజ సేవకు పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్ లో బాబూ జగజ్జీవన్ రామ్ .జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి పుష్ప మాలతో ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1921లో మెట్రిక్ పూర్తి చేసిన జగ్జీవన్ రామ్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కళాశాల విద్యను కొనసాగించారు.గాంధీ నాయకత్వంలో 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారని, బీహార్ శాసనమండలికి నామినేట్ అయ్యి తదుపరి బీహార్ శాసనసడకు. ఎన్నికయ్యారని తెలిపారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారని, నెహ్రూ ప్రభుత్వంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వంలో మంత్రిగా నియమితులయ్యారని తెలిపారు. దళితుల కోసం పని చేస్తూ, సమాజంలో సమానత్వం కోసం పోరాడాలని, దళిత నాయకులతో కలిసి సమాజ సంస్కరణల కోసం పాటు పడ్డారని వివరించారు. రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో, బంగ్లాదేశ్ యుద్ధంలో భారత్కు విజయం సాదించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె.పద్మలత, సాంఘిక సంక్షేమ అధికారి జనార్ధనరావు, డిఆర్డిఎ, డ్వామా పిడీలు వి.మురళి, విద్యాసాగర్, ఉద్యాన సాఖాధికారి పి. రమేష్ కుమార్‌రావు, ఎపిసి స్వామి నాయుడు, డిపి ఆర్ ఓ గోవిందరాజులు, డివిజినల్ పిఆర్ పండు రాములు, డీఎహెచ్ఓ జమాల్ బాష, క్రీడాశాఖాధికారి జగన్మోహన్ రావు, బాలసుందర బాబు పాల్గొన్నారు.

చింతపల్లి: జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యువి ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా జగ్జీవన్ రామ్ బడుగు బలహీన పేద ప్రజల అభ్యున్నతి కోసం పోరాటం చేసి హక్కులు సాధించడంలో విశేష కృషి చేశారని ఆయన అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని సమ సమాజం మార్పు కోసం పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణ అధికారి ఎన్ టి రామారావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేశారు. జగ్జీవన్ రామ్ జయంతిని స్మరిస్తూ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు యస్.అప్పనమ్మ వై.పద్మ, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోర్త బుజ్జిబాబు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్117వ జయంతి వేడుకలు రాజవొమ్మంగి ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద శనివారం నిర్వహించారు. మండలం నలుమూలల నుండి హాజరైన ప్రజలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం బుజ్జిబాబు, పెద్ద నూకరాజు, అయినవిల్లి తాతారావు, బోడపాటి కామరాజు, కాకాడ రాజేశ్వరి పాల్గొన్నారు.

పోటీల్లో సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

చిత్రలేఖనంలో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన 12వ ఆలిండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటేషన్‌లో నాలుగు బంగారు, నాలుగు వెండి పతకాలు సాధించి సత్తా చాటారు. ఆరో తరగతి విద్యార్థి ఎస్‌కె ఇస్సాక్, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం.హిమాశ్రీ, బంగారు పతకాలు, ఐదో తరగతి చదువుతున్న బి.జీవన్ దుర్గేంధ్ర, నాలుగో తరగతి విద్యార్థి డి.శృతి వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం విజయవాడలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ వేదికగా బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్వీ రాజశేఖర్ బాబు, డ్రీమ్ ఆర్ట్ ఫౌండర్ డాక్టర్ రమేష్ బాబు, జి సతీష్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ పోటీల్లో ఆంధ్ర తెలంగాణ, చెన్నై, తిరువూరు, కోణంగి వంటి ప్రాంతాల నుండి వందలాది మంది పాల్గొనగా, అందులో రాజవొమ్మంగి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చినట్లు డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు తెలిపారు. డ్రాయింగ్ టీచర్ కొండబాబును చిత్రలేఖనం పోటీల నిర్వాహకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్‌ను పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.శ్రీను, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

11 మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు

మిలీషియా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-పాడేరు: మావోయిస్ట్ పార్టీ గాలికొండ ఏరియా కమిటీకి చెందిన 11 మంది మిలీషియా సభ్యులు శనివారం అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, పాడేరు ఏఎస్పి (అడ్మిన్) ధీరజ్, చింతపల్లి అసిస్టెంట్ ఎస్పీ నవజ్యోతి మిశ్రా ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ, లొంగిపోయిన మిలీషియా సభ్యుల వివరాలను వెల్లడించారు. జి.కే. వీది, కొయ్యూరు మండలాలలో అనేక మారుమూల ప్రాంతాలు మరియు చెరుకుంపాకలు, చీడిగొంది. జెర్రిగొంది, కొత్తపాలెం, అన్నవరం, కుండలేయగొంది, చట్రాయి వంటి ప్రాంతాలలో అనేక నేరాలకు పాల్పడిన ఈ మిలీషియా సభ్యులు, మావోయిస్టు పార్టీ అవలంబిస్తున్న సిద్ధాంతాలకు విరక్తి చెంది మావోయిస్టు పార్టీ కార్యకలాపాలను వీడాలని స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసువారు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా చేపట్టిన స్ఫూర్తి, ప్రేరణ, నిర్మాణ్, సరళ్, సంకల్పం వంటి కార్యక్రమాల ద్వారా అనేక మంది గిరిజన యువతీయువకులు ఉద్యోగ ఉపాది అవకాశాలు పొందుతున్నారని, చెప్పారు. అదేవిదంగా ప్రభుత్వ నిర్మాణాత్మక సరెండర్ విధానం మరియు అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై జన జీవన స్రవంతిలో కలిసేందుకు వీరంతా లొంగిపోయినట్లు తెలిపారు. ఈ లొంగిపోయిన 11 మిలీషియా సభ్యులు సుమారు 39 నేరాలలో పాల్గొన్నారనీ వెల్లడించారు: లొంగిపోయిన 11 మంది మిలీషియా సభ్యులలో జీకే విధి మండలం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన వంతల బాస్కరరావు, జీడి గొంది గ్రామానికి చెందిన తాబేలు సుబ్బారావు, కొండలై గొంది గ్రామానికి చెందిన. కొర్రా కృష్ణ , .గెమ్మెలి పెంటయ్య, కొయ్యూరు మండలం జెర్రీ గొంది గ్రామానికి చెందిన పొంగి సత్తిబాబు, జీకే వీధి మండలం చెరుకుం పాకలు గ్రామానికి చెందిన నైనా గోపాల్, జి కే వీధి మండలం అన్నవరం గ్రామానికి చెందిన కూడా బొంజుబాబు, కిల్లో బుద్దుడు, జీకే వీధి మండలం పిట్రాయి గ్రామానికి చెందిన కొర్రా చిన్నారావు, చెరకుంపాకల గ్రామానికి చెందిన జర్త రమేష్‌లు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-చింతపల్లి: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి తరలివచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ సర్పంచ్ దురియ పుష్పలత శనివారం స్థానిక ఎంపీడీవో యువిఎస్ శ్రీనివాసరావుతో కలిసి చలివేంద్రం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ, చలివేంద్రం చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చలివేంద్రం కుండలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసి కొత్తనీరు వేయించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, కంప్యూటర్ ఆపరేటర్ తుచ్చ శివ, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శిని సత్కరిస్తున్న దృశ్యం

బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

ప్రజాశక్తి-గంగవరం

గంగవరం పంచాయతీ కార్యదర్శి ఎం.కృష్ణస్వామి, సూరంపాలెం పంచాయతీ కార్యదర్శి మద్దూరి అజయ్ బదిలీ కావడంతో వారిని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కలుముల అక్కమ్మ, బల్లెం శివ దొర, సచివాలయాల సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సూరంపాలెం సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి ఎం.అజయ్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పీసా అధ్యక్షులు దొంగబాబు, మాజీ సర్పంచ్ నారాయణరావు, కొత్తడా సర్పంచ్ సారపు కామరాజు దొర, సూరంపాలెం ఉప సర్పంచ్ కోసు బాపన్న, పీసా కమిటీ ఉపాధ్యక్షులు కుంజమ్ దొంగబాబు, కార్యదర్శి సారపు బాలు, వార్డ్ సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ చేపడుతున్న అధికారులు

తూతూ మంత్రంగా విచారణ : సిపిఎం

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని లక్ష్మీపేట గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగానికి సంబంధించి సిపిఎం నేతల ఫిర్యాదుతో శనివారం ఈవోపీఆర్డి విచారణ చేపట్టారు. అవినీతి అక్రమాలపై విచారణ తూ తూ మాత్రంగా జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్ని బాబు విమర్శించారు. ఒకే పనికి రెండు డిపార్ట్మెంట్లు డబ్బులు మంజూరు చేసారన్నారు. విచారణ అధికారులు సక్రమంగా నిర్వహించకుండా కుమ్మక్కై అవినీతికి పాల్పడిన వారికరి కొమ్ము కాస్తున్నట్లు అధికారుల తీరు ఉందన్నారు. ఈ విచారణతో ఉపయోగం లేదని భావిస్తున్నామన్నారు.పిర్యాదు చేసిన అంశాలపై అధికారులు దృష్టి సారించలేదన్నారు. మార్చిన డబ్బులకు పని జరిగిందా లేదా అని చూడడం లేదన్నారు. విచారణకు నిపుణుల కమిటీ వేయాలని తెలిపారు. ఈ విషయంపై గౌరవ ఉప ముఖ్యమంత్రి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కి ఫిర్యాదు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, సాగని ధర్మన్నప్పడాల్, గంగాధరం, నరసయ్య వెంకట్రావు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి గంగరాజు, నాయకులు

క్రీడల్లో యువత రాణించాలి

ప్రజాశక్తి - అనంతగిరి: యువత క్రీడా పోటీలలో రాణించాలని స్థానిక ఎంపిపీ శెట్టి. నీలవేణి, జెడ్పీటీసీ దీసరి. గంగరాజు, ఎస్పై శ్రీనివాస్ లు అన్నారు. మండల కేంద్రం పెద్దూరు గ్రామ క్రీడ మైదానంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యాన. క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ క్రీడ పోటీలలో యువత ముందు ఉండాలని పిలుపునిచ్చారు. ఆటలతో శరీరం దృఢత్వాన్ని నింపుతుందని, అంతే కాకుండా ఉల్లాసం, ఉత్తేజం కలుగుతాయని తెలిపారు.ఈ పోటీలలో మొదటి బహుమతి 20వేలు, రెండవ బహుమతి పదివేలను ఈనెల 14వ తేదీ అంబేద్కర్ జయంతి రోజు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల .రూతు, ఎగువ శోభ సర్పంచ్ కొర్రా. సింహాద్రి, ఉప సర్పంచ్ పి. అర్జున్, వార్డు మెంబర్ చిట్టం. వెంకటరావు, నిర్వహణ కమిటీ సభ్యులు కె. రామకృష్ణ, ఎస్ సుబ్బారావు, మండల తెలుగు యువత నాయకులు రంజిత్, బాబి, శ్యామ్ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

కొమ్మిక వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

గత కొద్ది రోజులుగా భానుడు ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజానీకానికి శనివారం వరుణుడు పలకరించి ఉపశమనం కలిగించాడు. ఉదయం నుండి విపరీతమైన ఎండ కాయగా, మధ్యాహ్నం తరువాత మేఘాలు కమ్ముకొని వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అంతలోనే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొయ్యూరు మండలం కొమ్మిక గ్రామ మెయిన్ రోడ్‌లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొమ్మిక- రేవళ్ల మార్గంలో చెట్లు రోడ్డుకు అడ్డంగా నేలకొరిగాయి. దీంతో వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ స్తంభాలు విడిగి పడడంతో ప్రజలు భయాందోళన చెందారు. మరోవైపు భారీ వర్షం జీడి మామిడి రైతులకు మేలు చేకూర్చుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రాజవొమ్మంగి : మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండకాచి సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా నల్ల మబ్బులు కమ్ముకొని ఈదురుగాలితో కూడిన భారీ వర్షం పడింది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న మన్యంవాసులు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. వర్షంతో పాటు పిడుగులు పడడంతో మన్యం వాసులు భయాందోళనకు గురయ్యారు.

కొయ్యూరు మండలం కొమ్మిక-రేవళ్లు మధ్య నేలకొరిగిన తాటిచెట్టు

పాడేరు టౌన్ : అల్లూరి జిల్లా ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు పరిసర ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం పడింది. పాడేరులో ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వాతావరణం వేడిగానే ఉంది. తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమైంది. కొద్దిసేపట్లోనే వర్షం మొదలైంది. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. వానతో పలు ప్రాంతాల్లో రోడ్లు, పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది.

రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

నష్టపోయిన జీడిమామిడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన జీడి మామిడి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు. మండలంలోని చాపరాతి పాలెం, కొత్తకింద్ర, ధమనపాలెం, లాగరాయి తదితర గ్రామాల్లో స్థానిక వ్యవసాయ అధికారి చక్రధర్ తమ సిబ్బందితో దెబ్బతిన్న జీడి మామిడి పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు తమ గోడును అధికారులకు విన్నవించుకున్నారు. ఇప్పటికే తోటలపై వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, తొలిత తోటలు పూతల బాగా పూసి ఈ ఏడాది దిగుబడి బాగా వస్తుందని ఆశించగా, పంట పక్వానికి వచ్చి చేతికి వస్తుందనే సమయంలో అకాల వర్షం, వడగళ్ళు వాన తమని తీవ్రంగా దెబ్బతీసిందని, పంట దిగుబడి పూర్తిగా పడిపోయిందని వాపోయారు. 300 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందన్నారు. తమ గోడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకి న్యాయం జరిగేలా చూడాలని అధికారులను రైతులు వేడుకున్నారు.

దెబ్బతిన్న తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తదితరులు

శ్రీరామగిరి ఆలయంలో ఐటిడిఎ పిఒ పూజలు

శ్రీరామగిరి ఆలయం వద్ద చింతూరు ఐటిడిఏ పిఒ అపూర్వ భరత్ తదితరులు

ప్రజాశక్తి- విఆర్.పురం : రెండో భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని శ్రీరామగిరి శ్రీసుందర సీతారామస్వామి ఆలయాన్ని శనివారం చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పిఒకు ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం పిఒ ఆదివారం జరగనున్న సీతారాముల కల్యాణం ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలకుండా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఎమ్మార్వో సరస్వతి, ఉత్సవ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

రాములోరికి పట్టు వస్త్రాలు సమర్పించిన గాంధీబాబు

మండలంలోని శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా రేఖపల్లి గ్రామానికి చెందిన ఎస్‌డిఎస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు దంపతులు శనివారం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే స్వామి తిరు కళ్యాణ మహోత్సవానికి తలంబ్రాలు బియ్యం అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాకరపాడులో శ్రీరామనవమికి ఏర్పాట్లు

కొయ్యూరు : మండలంలోని కాకరపాడులో సుమారు వారం రోజులపాటు జరుగు శ్రీరామనవమి తీర్థ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. కాకరపాడులో శ్రీరామనవమి ఉత్సవాలు సుమారు 81 సంవత్సరాలుగా జలుమూరి కుటుంబీకులు ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ తీర్థ మహోత్సవాలకు చుట్టు పక్కల మండలాల నుండి సైతం అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి తిలకిస్తూ ఉంటారు. ఈ తీర్థాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈనెల 6న సీతారామ కళ్యాణానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

8న గీతంలో యోగా మహోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా గల మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యాన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 8వ తేదీన యోగా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయుష్ ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.సునీత తెలిపారు. 100 రోజులు, 100 నగరాలు, 100 సంస్థలు పేరిట కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్వహిస్తోందని పేర్కొన్నారు. యోగా ద్వారా సంతోష భాగస్వామ్యం అనే నినాదంతో ఈ ఏడాది దేశ వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నాహకంగా 74 రోజుల ముందుగా కౌంట్‌డౌన్ డే పేరుతో వివిధ వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఈ మహోత్సవాన్ని గీతంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 8వ తేదీ ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు యోగాసనాలు, యోగా ప్రదర్శన, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని వెల్లడించారు. విశాఖలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంతో పాటు, ఆయుష్ అధికారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సిసి కేడెట్‌లు, యోగా కేంద్రాల ప్రతినిధులు, నగరంలోని వివిధ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం

ప్రజాశక్తి-మాధవధార : రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్‌చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని పి.వెంకటరమణ అధ్యక్షతన శనివారం కంచరపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20, 21 తేదీల్లో ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రజకులందరూ పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభలలో రజకులకు వృత్తి చెరువులపై హక్కు కల్పించాలని, రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, 50 సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్లు ఇవ్వాలని, ధోబి పోస్టులు భర్తీ చేయాలని, బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఆదరణ పథకంలో వృత్తి పరికరాలు, వాషింగ్ మిషన్లు అందజేయాలని తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.రమణ, కె.పరదేశిరావు, ఎస్.ఈశ్వరరావు, ఎన్.గౌరి, జి.గణేష్, కె.శ్రీను, ఎం.తిరుపతిరావు, ఎ.సింహాద్రి పాల్గొన్నారు.

కేంద్రకారాగారం వద్ద చలివేంద్రం

ప్రజాశక్తి - ఆరిలోవ

వేసవిని దృష్టిలో పెట్టుకొని కేంద్రకారాగారంలో ఖైదీలను కలిసేందుకు వచ్చిన సందర్శకుల కోసం కారాగారం సందర్శకుల గది వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రకారాగారం ఉప పర్యవేక్షణాధికారులు ప్రవీణ్‌కుమార్, జవహర్‌బాబు, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొని ఖైదీల కుటుంబ సభ్యులకు మంచినీటిని అందజేశారు.

కేంద్రకారాగారంలో ఈ - పేపర్ విధానంపై కార్యశాల

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఇక నుంచి ఉత్తర ప్రత్యుత్తరాలు పేపర్ రహిత విధానంలో నిర్వహించే విధంగా ఈ పేపర్ విధానాన్ని ప్రవేశ పెట్టనున్నారు. దీనిలో భాగంగా నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసి) బృందం విశాఖ కేంద్రకారాగారంలో కార్యశాల నిర్వహించింది. ఈ అవగాహన కార్యక్రమానికి కేంద్రకారాగారం ఉపపర్యవేక్షణాధికారులు, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కేంద్రకారాగారంలో జరిగే ప్రతి ఉత్తర ప్రత్యుత్తరాలను ఈ పేపర్ విధానంలో కంప్యూటర్‌లో ఎలా చేయాలన్న విషయాలను అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కారాగారం ఉప పర్యవేక్షణాధికారులు ప్రవీణ్ కుమార్, జవహర్‌బాబు, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రజాశక్తి-పెందుర్తి : అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లు అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జెర్రిపోతులపాలెం నుంచి మేఘాద్రి వరకు రూ.1.49 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా ఈ తారు రోడ్డు మంజూరు చేశానని, మళ్లీ తన హయంలోనే తారు రోడ్డు వేస్తున్నానని గుర్తు చేశారు. ఈ రోడ్డు పూర్తయితే సుమారు 14 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు.

అరకులోయలో అపారిశుధ్యం

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి -అరకు రూరల్: అరకులోయ మండల కేంద్రంలో ఎక్కడ చూసినా చెత్తదిబ్బలే దర్శన మిస్తున్నాయి.ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తోంది. అధికారులు తూతూమంత్రంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రమే ఒక ప్రాంతాన్ని ఎంచుకొని ,అక్కడ హడావుడి చేస్తున్నారే తప్పా అన్ని వీధులను శుభ్రం చేయించడం లేదని స్థానికులు మండి పడుతున్నారు.

గిరిజన మార్కెట్ వెళ్ళే దారిలో గిరిజనేతరులు డ్రైనేజీ లు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు నిర్మించడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో మురుగునీరు ఉండిపోయి ఆ ప్రాంతం దుర్గంధం వస్తోందని సమీప ప్రజలు వాపోతున్నారు. బిఎస్ఎన్ఎల్ టవర్ పక్కన ఎప్పటికప్పుడు చెత్తాచెదారం కుప్పలుగా దర్శన మిస్తున్నాయి. ఇంటి పన్ను చెల్లిస్తున్నప్పటికీ వీధులు పరిశుభ్రం ఎందుకు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ

డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

మూసుకొని పోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోందని స్థానికులు వాపోయారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాలకు పాల్పడితే చర్యలు

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చింతపల్లి: 18 ఏళ్ల లోపు చిన్నారులకు బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి వెంకట రమణి అన్నారు. చింతపల్లి గిరిజన సంక్షేమ సహాయ అధికారిణి జయ నాగలక్ష్మి, ఐసిడిఎస్ సిడిపిఓ ఏం రామలక్ష్మితో కలిసి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో బాల్య వివాహాలు, కిషోర్ వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేస్తే చిన్నారుల శారీరిక మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఉపాధ్యాయులు కిషోర్ బాలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించి, విద్యతోపాటు మంచి అలవాట్లు నేర్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్యవివాహాలు చేసుకోవటంతో విద్యకు దూరమై, సామాజికంగా వెనుకబడడంతోపాటు ఉపాధి అవకాశాలకు దూరమై వారి జీవితాలు ఆదిలోనే అంతమయ్యే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలు నిరోధించడానికి అందరూ బాధ్యత అవసరమని తెలిపారు.బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే స్థానిక అంగన్వాడి కార్యకర్త, మహిళా పోలీస్, పోలీస్ స్టేషన్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కార్యాలయాలకు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంప్రదించి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల వసతి గృహ నిర్వాహకురాలు బోనంగి నూకరత్నం, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ కే విజయ కుమారి, ఎస్.కె గౌహారున్నీషా, పి అప్పల నరసమ్మ, ఎస్.గౌరీ, అంగన్వాడి కార్యకర్తలు, ఎం ఎస్ కే లు పాల్గొన్నారు.

చిరంజీవిదొరకు ఘన నివాళి

ప్రజాశక్తి-పెదబయలు: మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సీకారి చిరంజీవి దొర కు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. అరకు మాజీ ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ సీకరి గ్రామంలో కుటుంబాన్ని పరామర్శించారు.మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం దహన కార్యక్రమం లో పాల్గొని పాడే మోసారు. వైస్ ఎంపిపీ కొర్ర రాజబాబు, మాజీ సర్పంచ్ సన్యాసి, బూత్ కన్వీనర్ కొర్ర కనకరాజు, యుటిఎఫ్ నాయకులు ఎస్‌బి ఎల్ స్వామి తదితరులు నివాళి అర్పించారు.

నివాళుర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ

నేరాలు ఘోరాలు

నాటు సారా శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి-పెదబయలు:జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం నాటు సారా శిబిరాలపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహించారు. మండలం లో కుంతుర్ల పంచాయతీ బోయితెలి లంక గ్రామంలో నాటు సారా తయారీపై ముందస్తు సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.సారాను విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు

126 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి కూర్మన్నపాలెం బస్ స్టేషన్ సమీపంలో ఢిల్లీకి చెందిన వ్యక్తి నుంచి 126 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు లా అండ్ ఆర్డర్ డిసిపి -2 మేరీ ప్రశాంతి తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కూర్మన్నపాలెం బస్ స్టేషన్ సమీపంలో సోదాలు నిర్వహిస్తుండగా ఢిల్లీకి చెందిన భగత్ సింగ్ (37) ఆరు ప్లాస్టిక్ సంచులతో 46 ప్యాకెట్లలో 126 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. ఇతనికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ సింగ్, ఢిల్లీకి చెందిన అమిత్ కుమార్ సింగ్ సహకరించారని వివరించారు. వీరిద్దరూ పరారీలో ఉన్నారని తెలిపారు. వీరు సంవత్సర కాలంగా విశాఖ మర్రిపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకొని విశాఖ మీదుగా ఢిల్లీకి పలుమార్లు గంజాయి తరలించారని విచారణలో వెల్లడైందని చెప్పారు. పరారైన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసినట్లు ఆమె తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని జానకయ్య పేట గ్రామానికి చెందిన ఈగల తాతబ్బాయి (80) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... ఈగల తాతబ్బాయి శనివారం తన కొబ్బరి తోటలోకి కాలిబాట నుండి వెళుతున్నాడు. నడుచుకుంటూ వెళుతున్న ఈగల తాతబ్బాయి తెగిపడిన విద్యుత్ వైర్‌ను తాకడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సన్నిబాబు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ కొనివ్వలేదని ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : బైక్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ద్వారకా పోలీసుస్టేసన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... రామాటాకీస్ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో పట్నాల రాము వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఆదిలక్ష్మి కుమారుడు కార్తీక్‌తో కలిసి అక్కడే నివాసముంటున్నారు. కుమారుడు పట్నాల కార్తీక్ (18) 8వ తరగతి చదివి మానేశాడు. అల్లరి చిల్లరగా తిరుగుతూ, ఖర్చుల కోసం డబ్బులు ఇమ్మని అడిగేవాడు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా ద్విచక్ర వాహనం కొనాలని తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. బైక్ కొనలేమని చెబుతూ తల్లిదండ్రులు మందలించారు. క్షణికావేశంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం కార్తీక్ ఉరివేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి ఉరివేసుకొని కనిపించిన కుమారుడు కార్తీక్‌ను కిందకు దింపి వెంటనే ఆసుపత్రి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కార్తీక్ తండ్రి రాము ఫిర్యాదు మేరకు ద్వారక సిఐ డివి రమణ, ఎస్ఐ గంగాధర్‌రెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన కెల్లా అచ్చిబాబు (32) శుక్రవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం... ఆనందపురం గ్రామానికి చెందిన కెల్ల సూరమ్మ, అప్పారావుకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మూడో సంతానమైన అచ్చిబాబు (32) ఆనందపురం సర్పంచ్ ఇంట్లో ఉంటూ 20 ఏళ్లుగా పనులు చేస్తున్నారు. అచ్చిబాబుకు ఏ సమస్య వచ్చిందో తెలియదు గానీ సర్పంచ్ ఇంటి పక్కన ఉన్న అతిథిగృహం ప్రహరీలో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రహరీ లోపల ఉండి పోవడంతో తెల్లవారుజాము వరకూ ఎవరూ చూడలేదు. శనివారం ఉదయం అచ్చిబాబు మృతి చెంది ఉండడాన్ని గమనించారు. సిసి పుటేజీని పరిశీలించగా రాత్రి 9 గంటల సమయంలో గోడదూకి వెళ్లి పురుగులు మందు తాగి పడిపోయినట్లు కనిపించింది. మృతుని తల్లి సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ చింతా వాసు నాయుడు, హెడ్ కానిస్టేబుల్ గాంధీ కేసు నమోదు చేశారు.

సదస్సులో మాట్లాడుతున్న కిషోర్ కుమార్

రాజ్యాంగమే దేశానికి రక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజ్యాంగమే భారతదేశాన్ని సెక్యులర్ దేశంగా కాపాడుతూ వస్తోందని, మన జీవితాలలో అది ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ సంయుక్త కార్యదర్శి జి.కిషోర్ కుమార్ అన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం'పై జ్యోతిరావుపూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతులను పురస్కరించుకుని విశాఖలో శనివారం సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగం మనకు ప్రసంగ స్వాతంత్ర్యం, మతాన్ని ఆచరించుకునే స్వేచ్ఛ, యూనియన్లు ఏర్పరచుకునే హక్కు, సమానత్వాన్ని అందించిందని తెలిపారు. రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించబడిందని తెలిపారు. అందులోని కీలకాంశాలను తెలియజేశారు. ప్రస్తుత పాలకుల విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. దేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించేలా కేంద్ర పాలకుల తీరు ఉందన్నారు. చదువుకున్నవారు ఈ ప్రమాదకర ధోరణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐసిఇయు అధ్యక్షులు ఎం.కామేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐసిఆర్ఇఎ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కళాధర్, ఎల్ఐసి ఒబిసి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బి.గణపతి రాము, బి.శ్రీనివాసరావు, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ మహిళా కన్వీనర్ సూర్యప్రభ, జి.వరప్రసాద్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - కశింకోట : ప్రేమ పేరిట వేధింపులు తాళలేక అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నర్సింగబిల్లి జంగాల కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని పిల్లబోయిన బ్యూలా (15) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణరావు కథనం ప్రకారం.. స్థానిక హైస్కూల్‌లో చదువుతున్న బ్యూలాను ఆమె ఇంటికి సమీపంలోనే ఉంటున్న యువకుడు ప్రేమించానంటూ వేధించసాగాడు. విషయం తెలిసి ఆ ఊరి పెద్ద మనుషులు కూడా ఆ యువకున్ని హెచ్చరించారు. పద్ధతి మార్చుకోవాలన్నారు. అయినప్పటికీ యువకునిలో మార్పు రాకపోగా మరింతగా వేధింపులు పెరిగాయి. దీంతో మనస్తాపం చెందిన బ్యూలా శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు ఆమె తండ్రి వరహాలరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేధింపులకు గురిచేసిన యువకుని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కస్టమైజ్డ్ కూలింగ్ ఎసిల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఏటా వేసవి కాలంలో విద్యుత్ వినియోగం, డిమాండ్ పెరుగుతోందని సామ్‌సంగ్ ఎయిర్ కండిషన్ విభాగం హెడ్ ఆదిత్య బబ్బర్ అన్నారు. తమ తాజా ఆవిష్కరణ అయినటువంటి కస్టమైజ్డ్ కూలింగ్ ఎసిలను విశాఖలోని స్టోర్‌లో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి నెలల్లో ఎయిర్ కండిషనర్ల వాడకం పెరుగుతుందన్నారు. చల్లదనానికి మారుపేరుగా సామ్‌సంగ్ తాజా ఎయిర్ కండిషనర్లు నిలుస్తున్నాయని తెలిపారు. మెరుగైన విద్యుత్ పొదుపుతో నిరంతరాయ సౌకర్యాన్ని ఇవి అందిస్తాయని పేర్కొన్నారు. సామ్‌సంగ్ 2025 బెస్పోక్ ఎఐ శ్రేణి ఎయిర్ కండిషనర్లలో 'కస్టమైజ్డ్ కూలింగ్' స్మార్ట్ థింగ్స్ ఆధారిత పరిష్కారాన్ని పరిచయం చేసినట్టు వెల్లడించారు.

బంగారు తాళిబొట్టు, పట్టుచీర అందజేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తానని జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. శనివారం గొల్లలపాలెం ప్రాంతంలో నవ వధువు ప్రత్యూషకు బంగారు తాళిబొట్టు, పట్టు చీర, పసుపు కుంకుమలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో రూప, శాలివాహన్, బుజ్జి, సూరాడ అప్పారావు, కందుల కేదార్నాథ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో స్థానికుల ఉపాధి ఎక్కడ ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జరిగిన, జరుగుతున్న అన్యాయంపై ప్రజలు మాట్లాడనంతకాలం, ఐక్యంగా కదిలి ఎదిరించనంతకాలం పాలక పార్టీలకు, అవి ప్రాతినిధ్యం వహిస్తున్న పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలకు ఎదురుండదు. పీడిత ప్రజలంతా విడివిడిగా ఉండాలని అవి కోరుకుంటాయి. చీలిపోయి ఉండేలా పాచికలు వేస్తాయి. ఆ పాచికల వెనుక పాపం తెలియని ప్రజలు కోపం బదులు నిస్సహాయతతో బతుకుతున్నారు. విశాఖపట్నం - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) నక్కపల్లి మండలంలో భూములు సేకరించింది. రైతుల జిరాయితీ భూములకు పరిహారమిచ్చి అందులోని కొబ్బరి చెట్లకు ఐదు వేలు చొప్పున ఇస్తామని రూ.1500, అంతకంటే తక్కువ చెల్లించింది. జిరాయితీ భూములతో సమానంగా డి పట్టా భూములకు నష్ట పరిహారం చెల్లించాలని చట్టం చెబుతున్నా కోతపెట్టి పరిహారం ఇచ్చింది. డి పట్టా భూముల్లోని చెట్లకు నష్టపరిహారం ఇవ్వనేలేదు. పేదల సాగులోని భూములకు పరిహారం చెల్లించకుండానే భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. తరలించాల్సిన గ్రామాల్లోని కుటుంబాలన్నింటినీ గుర్తించి పరిహారం పూర్తిగా చెల్లించలేదు. మేజర్లకు ప్యాకేజీ ఎంత చెల్లిస్తామనేది చెప్పలేదు. భూములు, ఇళ్లు, ఉపాధి పోయిన బాధితులంతా పరిహారం కోసం తిరుగుతుంటే ప్రభుత్వం నిర్వాసితులను వదిలి ప్రయివేటు మిట్టల్ స్టీల్‌కు భూముల కేటాయింపు నుంచి తాజాగా డిఎల్ పురంలో క్యాప్టివ్ పోర్టు వరకూ ఆమోద ముద్ర వేస్తూ ముందుకు సాగుతోంది.

ప్రజలకు ఉపాధి, ఉద్యోగ భ్రమలు కల్పించి, పరిశ్రమాధిపతులకు భూములు కేటాయించి కోట్ల విలువైన రాయితీలను ప్రభుత్వం ఇస్తోంది. భూములు పోయినవారంతా ఉపాధిలేక వీధినపడుతున్నారు. ప్రభుత్వ రాయితీలతో పరిశ్రమలు పెట్టుకున్న పారిశ్రామికవేత్తలు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్ వరకు జరిగింది ఇదే. ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధిలో నష్టపోయిన ప్రజలకు కలిగిన లాభం శూన్యమే. పరిశ్రమలతో ప్రజలకు వచ్చేది ఉపాధి కాదు, కాలుష్యంతో జబ్బులు. ఎన్‌టిపిసి నుంచి ఫార్మా, హెటిరో డ్రగ్స్, డెక్కన్ కెమికల్స్ ప్రాంతాల్లో సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేయడానికి ఇష్టపడ్డంలేదు. తాగునీరు సరఫరా చేయడానికి ముందుకురావడంలేదు. అర్హతకు తగిన ఉద్యోగం స్థానికులకు ఇవ్వడంలేదు. ఇవన్నీ తెలిసిన ప్రభుత్వం ప్రజలకు భ్రమలు కల్పించేందుకు మిట్టల్ స్టీల్‌తో వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని డప్పు కొడుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనంపై తమ భాగస్వామ్య ప్రభుత్వం ఎన్‌డిఎపై ఒత్తిడి చేయని కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో అన్ని అనుమతుల జారీకి మిట్టల్‌ను భుజానవేసుకుంది.

పరిశ్రమల్లో నిర్వాసిత కుటుంబాల్లో ఎంతమందికి ఉద్యోగాలు లభించాయో ప్రభుత్వాలు సమీక్షించడంలేదు. భూములు, రాయితీలు ఇవ్వడమేగానీ స్థానికుల ఉపాధి ఊసెత్తడంలేదు. మిట్టల్ స్టీల్ పరిశ్రమతో వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెబుతున్న మాటల్లో ఎంత నిజముందో వెయ్యి ఎకరాలను రూపాయి చొప్పున కేటాయించిన బ్రాండిక్స్ గురించి తెలిసిన వారికి అర్ధమవుతుంది. 60 వేల మందికి ఉపాధి కల్పిస్తామని 25 వేల మందికి కూడా కల్పించకుండా, ఇచ్చిన భూమిని ఇతర కార్యక్రమాలకు వినియోగించడానికి అధిస్టాన్‌ను తెరమీదకు తీసుకొచ్చిన బ్రాండిక్స్ చరిత్ర ప్రజలకు తెలియనదికాదు. మోసగిస్తున్న ప్రభుత్వాలను బాధిత ప్రజలు నిలదీయనంతకాలం పరిస్థితిలో మార్పు రాదు.

కల్యాణ మండపం లీజు బకాయి రూ.15 లక్షలు

అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్న జనసేన నేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జనసేన దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి చెందిన కల్యాణ మండపాన్ని లీజుకు తీసుకొని ఆరు మాసాలుగా లీజు బకాయి చెల్లించకుండా దేవస్థానం అధికారులను ముప్పుతిప్పలకు గురి చేస్తున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేనకు చెందిన నేత కావడం వల్లే ఇంతలా వ్యవహారం నడుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం దత్తత దేవాలయంగా అంబికా బాగ్ ఉంది. జగదాంబ జంక్షన్‌లో ఉన్న అంబికా బాగ్ దేవాలయంలో కల్యాణ మండపం ఉంది. దీన్ని జనసేన పార్టీకి చెందిన నాయకుడు ఒకరు నెలకు రూ.2.5 లక్షలు లీజు చెల్లించడానికి అంగీకరిస్తూ మూడేళ్ల కాలానికి లీజుకు తీసుకున్నారు. దాదాపు ఏడాది పాటు లీజు సక్రమంగా చెల్లించారు. ఆ తర్వాత లీజు సొమ్ము సక్రమంగా చెల్లించలేదు.

అధికార అండతోనే..

గతంలో అప్పటి అధికార పార్టీ వైసిపిలో ఉండే శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం అంబికా బాగ్ కల్యాణ మండపాన్ని లీజుకు ఇచ్చారు. ఆ సమయంలో సింహాచలం కుమారుడే ఆ కల్యాణ మండపాన్ని లీజుకు తీసుకున్నారు. తదుపరి రాష్ట్రంలో వైసిపి పాలన పోయి కూటమి ప్రభుత్వం రావడం, అంతేకాకుండా కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేనకు చెందిన సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా


అంబికాబాగ్ కల్యాణ మండపం

ఎన్నికకావడం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉండాలని, అధికార పార్టీలో ఉండాలనే ఆలోచనతో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తన అనుచరులతో వైసిపిని వీడి జనసేనలో చేరారు. అదే సమయంలో ఆమె కుమారుడు కూడా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అంతే, అప్పటినుంచి కల్యాణ మండపానికి నెలవారీ చెల్లించవలసిన అద్దె చెల్లించడం మానేశారు. ఈ విధంగా ఆయన బకాయి ఉన్న అద్దె రూ.15 లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి ఇటీవల లీజుదారుకు నోటీసు ఇచ్చారు. తక్షణం లీజు బకాయి చెల్లించాలని లేకుంటే లీజు రద్దు చేస్తామని ఆ నోటీసులో హెచ్చరించారు. అయినప్పటికీ ఆయన ఏమాత్రమూ చలించలేదు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : పంచాయితీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి వచ్చేలా సచివాలయ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఈఓపిఆర్డీ తలుపులు నాయుడు, ఎంపీడీవో ఎస్‌కెవి.ప్రసాద్ అన్నారు. కొయ్యూరు మండల పరిధిలోని 27 సచివాలయాలలో నిర్మించిన చెత్త నుండి సంపద కేంద్రాలలో జన వ్యర్థాల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోతున్న తడి పొడి చెత్తను వేర్వేరుగా ఏర్పాటు చేసిన కుండీలలో వేసి వాటిని సిప్టర్ల ద్వారా తరలించే విధంగా కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో వృద్ధిలోకి వచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి-అడ్డతీగల : సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ పక్కల పంచాయతీలకు చెందిన నెలలు నిండిన గర్భిణీలు ప్రసవాలు ఆసుపత్రిలో చేయించుకోవడం వల్ల తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రసన్న దేవి అన్నారు. ఈ మేరకు గర్భిణులు తీసుకోవలసిన పలు జాగ్రత్తలపై వైద్య సిబ్బందితో కలిసి శనివారం ఆమె ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి వద్ద ప్రసవాలు జరిగితే కలిగే నష్టాలు, ఆసుపత్రిలో ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డకు కలిగే లాభాలపై వివరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని, పండ్లు, ఆకుకూరలు, పప్పు, మాంసం, చేపలు వంటివి తీసుకుంటే మంచిదని చెప్పారు. గర్భిణీ స్త్రీలు జాగ్రత్తలు పాటిస్తే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని, శిశువుల్లో రోగ నిరోధక శక్తి పని తీరు మెరుగుపడుతుందని తెలిపారు, వైద్యులు సూచనలు తప్పక పాటిస్తే సిజేరియన్ ప్రసవాలు జరిగేందుకు ఆస్కారం తక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సులు వరలక్ష్మి, రామలక్ష్మి, జిడి ఏ దేవుడు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : పక్కనే ఉన్న రంపచోడవరం నియోజకవర్గంలో మాదిరిగానే పాడేరు నియోజకవర్గం పరిధిలోని కొయ్యూరు మండలంలోనూ జీడి పిక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. రంపచోడవరం నియోజవర్గంలోని జీడిమామిడి రైతులు దళారుల చేతులలో మోసపోకుండా జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రొసెసింగ్ యూనిట్లు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ప్రకటించారని, పక్కనే ఉన్న పాడేరు నియోజకవర్గం పరిధి కొయ్యూరు మండలంలో జీడిపిక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో మాదిరిగా వందన్ వికాస్ కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలని, దీని వల్ల రైతులకు మద్దతు ధరతో పాటు తూనికల్లో మోసాలు కూడా జరగకుండా ఉండే అవకాశం ఉందని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఘనంగా సముద్ర దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 62వ జాతీయ సముద్ర దినోత్సవాన్ని విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సముద్ర యాత్రికుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళ్లరించారు. అనంతరం పోర్ట్ టగ్ ఫ్లోటిల్లా ఇచ్చిన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నౌకాయాన, సముద్ర రవాణా రంగాలు దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, ఇండియన్ కోస్ట్‌గార్డ్ డిఐజి రాజేశ్ మిట్టల్, హెచ్ఐఎంటి ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు డాక్టర్ నందమూరి తారకరామారావు జయంతిని తెలుగు జాతి ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎన్‌టిఆర్ ఆత్మగౌరవ దినోత్సవ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇప్పటికే గిడుగు వెంకట రామమూర్తి, పింగళి వెంకయ్య, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, గౌతు లచ్చన్న తదితరుల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ కార్యక్రమంగా చేస్తున్నారని తెలిపారు.